# ఛాందోగ్యం

ఆ లోకం...

ఆ-లోకం; దీనికన్న, అదో 'మాఁ లోకం'.

—చచ్చి చెడి, ఏలాగో అక్కడికి...—దిగజారితే! ఎగప్రాకితే...

ఈ లోకంలో చావని బ్రతుకంతా, పిశాచ పీడగా ఆవహిస్తే, మరి. అప్పుడు...

ఆ లోకాన్నుంచి...ఏ లోకానికి ఎగ, దిగ...?

ఠీక్...అఫ్సోస్...

చావంత చచ్చిన చ్ఛావు, మరొకటి లేదు.

చావు-బ్రతుకులు...

బ్రతకమని, యీాజోగాయ్-మాధాయ్ లంతా, వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

...బ్రతికుండగానే...

—బ్రతకను కదా అనే నిరాశతో, పెళ్ళాం మెళ్ళో పుస్తే—పూసా, భువనేశ్వరంలో ఆసామి-సన్నిధిని...మీాద కట్టింది—

చచ్చిపోతే...నేను చచ్చినంత ఒట్టు...

నామీాద...నామీాద...ఒట్టు—

అక్కడా, అక్కడా అడ్రెస్ తెలియని ప్రియురాళ్ళందరూ...

రాళ్ళకూ, రప్పలకూ, మొక్కుకుంటూ రంటావా?

ఒక్కటె ముక్కూ మొగమైనా జ్ఞాపకం లేదు, ఇప్పుడు...నిజం చెప్పొద్దూ—

ఉహూ...(

ఒప్పుకోను...

అబ్బ! ఒప్పుకోనంటే, ఒప్పుకో నోహో అని, నన్ను, ముప్పతిప్పలూ పెట్టలా, అవాళ...అప్పన్న మేనకోడలు?

అదేనయ్యా...దీం తస్సాదియ్యా.

అప్పటికీ...ఇప్పటికీ...

మన మగసిరి మీాద, ఈటె.

పోటు...

అబ్బ!...పో-టు...

...మెత్తహో ఉండేవి కావూ దాని చెంపలు?

...కెంపులు చుట్టూతా, మధ్య మాంచి రవ్వ...ఆ ముద్దుల్లో తళుక్...

—హా...బ్బా—ఎడం డొక్కలో క-ళుక్...మంది.

—మందిచ్చినప్పుడల్లా పుచ్చుకోవాలా, ఏం—

గుచ్చుకుంటుందోయ్...చెన్నకేశవులూ-

ఏపూట కాపూట, పంకజమ్మ చెల్లెలి చూపులు... యుష్మత్ సూదికి...తాతగా — ముత్తాతగా... గుచ్చుకునేవోయ్...

అబ్బాయిగాడి మేనత్తను-కొంచెం కదలేసి, సంగతేమిటో తేల్చవే అని, హెచ్చరించడానికే, మనకు ముచ్చెమటలూ పోసినాయ్...

ఆసుపోసినట్టుగా, అటూ ఇటూ తచ్చాడి...ఆపక్కనుంచి ఈ పక్కకూ...యీ...

ఊఁ... యీపక్కనే పడి ఉండనీయ రేమ్రా...

ఇటు ఒరిగినా...అటు తిరిగినా, మధ్య మీకు ఒరిగేదేముందీ ?

మీకు...ఏం ఒరిగిందీ ?

నన్ను మరిగిందనుకుని, ఒళ్లు హూనం చేశాడు కాదూ, సీనయ్య, అమ్మణమ్మను, అవాళ... తెల్లారిగట్ట...

ఇవాళ-గడిచేట్టు లేదేం? ఏమో లేకపోతె, ఏం!

...'ఏం రాకపోతే, ఓఁ—యబ్బో! నువ్వు లేకపోతే ...నీతాత,...'అంది కాదూ, అక్కమ్మ ముత్తవతల్లి?

పిల్ల...పసందైది కదా అని, కొండమీది కోతులన్నీ దింపాను దానికోసం...

—కోసం...మో...సం—

—నన్ను మోసం చెయ్యకండో అంటూ, ఇంటావిడ రాగాలు సాగించడానికి...ఇంకా ఎంత టైమ్ ఉంది ?

...ఇల్లూ-బంగారం

దానిల్లు బంగారం కానూ...

'ఇల్లూ వాకిలీ అంటూ కాస్త ఏర్పడితే... మీ పేరు చెప్పుకుంటానండీ' అని, బ్రతిమాలుకుంది, పాపం, వారిజ :

...'ఇంటి వాసాలు లెఖ్ఖెట్టేందుకు, నేనొక్కణ్ణే చాలునటే...' అన్నాను...చిన్నబుచ్చుకుంది...

అలా...నొచ్చుకోవడమే, దానికి అచ్చొచ్చింది.

—మరీ పచ్చిపహా ఉన్నాయేం, బత్తాయిలు?... ఫలం పాటు...

'ఆటూ పోటూ వేళ-అక్కడ కాదు, ఇక్కడ ఉందాం రండి!' అని...అది చిలకకు చెప్పినట్టు చెప్పింది...

ఉహూఁ...అంటే ఉహూఁ...

దానికన్న నేను తడిసి ముప్పందుమైనా...

కైనా, నాకు వాడితే చెవుడు నీకు రావాలేం?—

ఏం సాంబశివుడూ, ఏం చేస్తాందిరా, మీకన్నమ్మ...

...అన్నము, పున్నెమే నెరుగనమ్మ...ఛస్, ప్రబంధంలో ఆవిడ పద్యం పాడకపోతే, ఏం ?

ఏం-రోగం?

రోగం?-నాయ్-నాయ్: అంటే పేదవాళ్ళకు వచ్చే జబ్బు, మనది, వ్యాధి, ఇతి వైజయంతీ...

కాంతిలో నిలువకే... నీ చెక్కులు, కందితే...

అందితే వదిలేవాణ్ణా? దానియక్క-చాటున దాక్కుంటే మాత్రం ?

...మాత్ర మింగినా, మంచినీళ్ళు తాగలేను... మా మనోహరా...

తాగలేనూ?—

మీగడ తీసేసి తోడెట్టావా ఏమిటే మీ అమ్మాయిని సింహాచలం ?

—లేదు, బాబూ, పక్కింటి నాగేశ్వరికన్న, ఎటు చూసినా, మాచంటిదే కా స్త చిక్కన...

అందోయ్-అయ్ తేనే రమ్మందోయ్.

ఓయ్ అనకముందే కోయిలను కవ్వించేదోయ్, కొంటెపిల్ల...

—జంటస్వరాలనేవాళ్ళం అప్పలస్వామి కూతుళ్లను...

అందుకోసం కాదుగాని. అవాళ మొత్తానికి రంగా రావుకు పళ్లురాలినాయ్.

...బొంయ్-మనటమేకాని, అరవిందది అంతా పట్టి బోకరింపని నిమిషంలో తేల్చేశాం కాదూ ?

ఆదిలక్ష్మి కళ్ళల్లో అదోమాదిరి అందం...

పందిరిమంచం మీంచి క్రిందికి దింపేట్టున్నారే ?...

—బాలీసులాగా ఉండేది, గాలీబు మరదలు—

వరదా, మువ్వ గో - పా...లా...

చాలించండోయ్ ఏడుపులూ...చావు, దగ్గిరకు రావడానికి హడలుతూంటేను !

సుబ్బులూ...

సుబ్బులు దుబ్బులుగా పుట్టడానికి, ఏమిటో మహత్తర కారణం ?

దేశంలో లేస్తే మనకేం పట్టింది ?...మనకు లేచిందే రణం...

వ్రణకిణాంకిత...బిగ్గరగా ఆడవాళ్ళముందు అనేందుకు వీలు లేకుండా, అక్కడ, ఓ బూతు తగలేయకపోతేనేం, జగ్గాయ్ ?

...ముగ్గు చెరిపేస్తానని బెదిరిస్తే, బుగ్గలు నులిమేసింది కాదూ, అమాంతం... లక్ష్మీకాంతం –

ఎంత భారీమనిషో, స్వారి చేసినట్టుండేది...ఛాయ... సడీ చప్పుడూ లేకుండావచ్చి, జాజిపొదను గడ – గడలాడించేది...

మడిమే కా, కృష్ణుడిలో దక్కిన మానవత్వం...

పాపం నిత్యద్వైత్వంగా బతికిన బతుకు...తల్లీ...

—మన గోడమీంద మెసిలే బల్లికి, పిల్లలు ఎందరో? వల్లీ వల్లని మగడైతే...తల్లిప్రాణం కాదూ? మరి...తల నుంచి తోకకు వస్తుందా ?

ఇంఖా పుందుకు రాస్తూంది ఇల్లాలు; మళ్ళాగట్టెక్కితే మాత్రం మర్యాద దక్కిస్తాననే నమ్మకం ఏమిటో ?

అమ్మకచెల్ల నాదు మన సమ్మక చెల్లదు...ప్చ్... తంజావూరులో ఏమూల చూచినా ఇలాగే తిక – మక :

…రకానికో కొరకాన్ని, గికురించే…

సకిమోమూగ - నాలేనీ…నా…

మనసా వాగబోకే - మళ్లీ జన్మలో మనకు ఈ రంధి ఎలాగూ తప్పదు…

దుకూల చౌరాయ…నూతన జలధర రుచయే, గోపీ వధూ…టీ…